భూపాలపల్లిలో ఘనంగా పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్మృతి పరేడ్ నిర్వహించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్ దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 155 మంది పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. అనంతరం అమరవీరులకు గౌరవ వందనం సమర్పించి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ దేశ భద్రత,ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలని సూచించారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. దేశం, సమాజం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్నకృషిఅభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.వారికి ధైర్యం చెబుతూ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. అమరవీరుల సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పోలీసులు ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనారాయణ, రెహమాన్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, పోలీస్ సంఘం అధ్యక్షుడు నరేష్, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యానగర్ కాలనీలో దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం :చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్ కాలనీ లో గ్రామ ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి ఇంటి దగ్గర ఏర్పాటు చేసిన దుర్గామాత మండప కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు భక్తి పారవశ్యంతో, ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్న విద్యానగర్ కాలనీలోని దుర్గామాత మండపాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించారు. ఈ సందర్భంగా జగన్మాత దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.దుర్గామాత మండపంలో భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తూ పూజలు నిర్వహిస్తుండగా, ఎమ్మెల్యే రాకతో మండపం వద్ద సందడి నెలకొంది. అనంతరం మండప కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి , వివిధ వార్డ్ మెంబర్స్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బిక్కిసాని నాగేశ్వరరావు , కోనేరు చిన్ని , కోనేరు పూర్ణచందర్రావు , ప్రముఖ డాక్టర్ రమేష్ బాబు , ప్రముఖ రిటైర్డ్ ఉపాధ్యాయులు డి. వెంకటేశ్వరరావు (డివి) మండప కమిటీ సభ్యులు , భక్తులు స్థానికులు, పాల్గొన్నారు.

మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ నేత



ప్రజాస్ఫూర్తి,కొత్తగూడెం :చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో దుర్గ మాత మండపం వద్ద మండప కమిటీ సభ్యులు స్థానికుల సహకారంతో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి భావం, సేవా దృక్పథంతో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో అన్నదానం నిర్వహించడం పట్ల భక్తి భావంతో పాటు సేవా గుణం కూడా పొందుతుందని ఆయన అన్నారు . అనంతరం పలువురు అతిథులను మండప కమిటీ సభ్యులు సన్మానించారు .ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి, వార్డ్ మెంబర్స్ కృష్ణమూర్తి, జకరయ్య, శంకర్, నాగమణి, రమాదేవి, పూర్ణ, రజిత, కృష్ణవేణి, స్థానికులు కృష్ణమోహన్,మాధవరావు కృష్ణమోహన్, మహేశ్వరరావు, రామారావు, లాయర్ శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, యేలాద్రి, రమణ, షా, వేణు, సురేష్, లోకేష్, రమేష్,మండప కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

పరెడ్డిగూడెంలో ఘనంగా దుర్గామాతా శోభాయాత్ర



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: పరెడ్డిగూడెం గ్రామంలో విజయదశమి దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక కోలాహలం నడుమ నిర్వహించారు. గత తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న అమ్మవారు, పుర వీధుల్లో నిర్వహించిన శోభాయాత్రలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ శోభాయాత్రలో స్థానిక మహిళలు భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా చెక్కభజనలు చేస్తూ, తాళాల శబ్దాలకు అనుగుణంగా అడుగులు వేస్తూ యాత్రను ముందుకు నడిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, మహిళల చెక్కభజనల నడుమ భక్తులు చేసిన “జై భవానీ.. జై జై భవానీ” జయజయధ్వానాలతో పరెడ్డిగూడెం గ్రామం మారుమోగింది. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా విజేతకు అంబేద్కర్ యూత్ ప్రతినిధులు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతిగా స్కూటీని అందజేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామస్తులందరి సహకారంతో, కులమతాలకు అతీతంగా సమైక్యతతో ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని, దుర్గామాత ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. యాత్ర పొడవునా మహిళలు అమ్మవారికి నీరాజనాలు అర్పించి మొక్కుబడులు చెల్లించుకోగా, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, అనంతరం భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, భైంసా:నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని దేగాం గ్రామానికి చెందిన సుంకేకర్ లత విఠల్ కుమారుడు సుంకేకర్ వినాయక్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ ను అందుకోవటం జరిగింది. వారి సోదరుడు బి ఎం ఎస్ పాస్ ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివెరసిటీ లో మాస్టర్ ఇన్ విసువల్ ఆర్ట్ లో గోల్డ్ మెడల్ రావటం జరిగింది.ఎవరి చిత్రాన్ని అయినా చూసిన ఐదు నిమిషాల లోపు గీయటం ఈయన యొక్క ప్రత్యేకత, మాజీ శాసనసభ్యులు మాట్లాడుతు, నిరుపేద కుటుంబం అయినప్పటికీ విట్టల్ ఎంతో కష్టపడి పిల్లలను అత్యున్నత చదువులు చదివించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన మాట చదువు అనేది ఒక్కటే మనల్ని ఎంతో అత్యున్నత స్థానంలో నిలబెడుతుంది అని అన్నారు.వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సూర్యంరెడ్డి, గడ్డి గారి చందురెడ్డి,ద్యావరీ భోజన్న, నరేష్, గ్రామస్తులు ఉన్నారు.

భాస్కర్ థియేటర్ వద్ద రావణ దహనం





: ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

*** 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 13వ వార్డు అభ్యుదయ యూత్ యూత్ ఆధ్వర్యంలో భాస్కర్ థియేటర్ ఎదురుగా మంగళవారం రాత్రి రావణ దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై రావణ దహనం కావించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికి తాము చేసే పనిలో విజయం కలగాలని ఆకాంక్షించారు. జమ్మి చెట్టుకు పూజలు చేసి, వార్డు ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు జమ్మి ఆకును పంచుతూ,ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.అలాయ్ బలాయ్ చేసుకుంటూ, టపాకాయలు కాల్చుతూ, సంతోషంగా పండుగ జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలి

*** ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్**



ప్రజాస్ఫూర్తి,భైంసా:నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని పురాణబజార్, భవానీ చౌక్ వద్ద నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన హారతి కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనోత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. విద్యుత్, మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జనోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కోరారు. ప్రజలందరూ శాంతియుతంగా ఉత్సవాల్లో పాల్గొని అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యువత భవిష్యత్తుకు విద్యే బాట!

*** పోటీ పరీక్షల అభ్యర్థులకు 50 కిట్ల పుస్తకాల పంపిణీ**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గ్రామీణ యువతలో విద్యా చైతన్యం పెంపొందించి, పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో ది మిషన్ ఫౌండేషన్ ఫౌండర్ ఏడుకొండలు అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని కల్మలచెరువు గ్రామంలో జరిగిన అభినందనీయ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మిర్యాలగూడ డీఎస్పీ రవి, ఎక్సైజ్ సీఐ, ది మిషన్ ఫౌండర్ ఏడుకొండలు, గరిడేపల్లి ఎస్సై శ్రీకాంత్ గౌడ్ లు పాల్గొని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడేలా తెలుగు, ఇంగ్లీష్ మీడియాలకు చెందిన 50 కిట్ల పుస్తకాలను అందజేశారు. అనంతరం ఈ సమావేశానికి హాజరైన ముఖ్య అతిథులు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఫౌండేషన్ అందించిన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరైన ప్రణాళికతో చదువుతూ, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. ఉద్యోగ సాధనకు నిరంతర కృషి, పట్టుదల, జ్ఞానాన్ని పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.వ్యక్తిజీవితాన్ని మార్చడమే కాకుండా, సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించే శక్తి విద్యకు మాత్రమే ఉందన్నారు. కేవలం డిగ్రీలు సంపాదించడమే లక్ష్యంగా కాకుండా, జ్ఞానాన్ని పెంపొందించుకొని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అవసరమైన పుస్తకాలను అందించడం ద్వారా వారి ఉద్యోగ సాధనకు తోడ్పాటు అందించిన ది మిషన్ ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బచ్చలికూరి శ్రీను, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, విద్యావంతులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మద్దికుంట బాల ఎల్లయ్య (43) ఆత్మహత్య చేసుకున్నట్లు ముస్తాబాద్ ఎస్ ఐ జ్యోతి తెలిపారు. బాల ఎల్లయ్య తాను మంగలి షాప్ పెట్టుకోవడానికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక బాధపడుతూ, మద్యానికి బానిసయ్యాడని తెలిపారు. గత ఏడు రోజులు నుంచి పిచ్చి పిచ్చి చేస్తూ తిరుగుతూ జీవితం పై విరక్తి చెంది ఈ నెల 19న మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడని తెలిపారు. ఈ నెల 20న ముస్తాబాద్ పెద్ద చెరువులో మృతదేహమై కనిపించాడని తెలిపారు. దీంతో మృతుని భార్య మద్దికుంట మానస ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ జ్యోతి తెలిపారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- జిల్లా కలెక్టర్, ఎస్పీ



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలోఘనంగా నిర్వహించారు. దేశ రక్షణ కోసం, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తో పాటు,అమరవీరుల కుటుంబ సభ్యులు,అధికారులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమన్నారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు చేస్తున్నకృషిఅభినందనీయమని తెలిపారు.అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ పోలీస్ విధి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధతతో కూడిన పవిత్రమైన కర్తవ్యమని అన్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అమరులైన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ మరచిపోలేనివని, వారి సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులందరికీ ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు గౌరవాభివందనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీ కె. శివరాం రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ అధికారులు,సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విజయదశమి.. విజయాలను అందించాలి

*** కచ్చిరు వద్ద విజయదశమి వేడుకలు**

*** చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విజయదశమి.. ప్రజలందరి జీవితాల్లో విజయాలను అందించాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కచ్చీరు వద్ద మంగళవారం రాత్రి విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కచ్చీరు వద్ద సాంప్రదాయబద్ధంగా మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా శమీ పూజ నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపల్ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగ జరుపుకుంటామన్నారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. ప్రజలు చేపట్టే ప్రతి కార్యంలో విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా భగవంతుడిని వేడుకున్నారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రావణాసురుడి వధ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవీ నవరాత్రుల్లో భవానీ దీక్షలు చేపట్టే వారి సంఖ్య చౌటుప్పల్ మున్సిపాలిటీలో పెరిగడం, చిన్నపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు దీక్షలు తీసుకోవడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, మున్సిపాలిటీలోని చౌటుప్పల్ పుర ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

రామగిరి రామాలయంలో ఘనంగా దసరా వేడుకలు

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ :నల్లగొండ పట్టణంలోని రామగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో దసరా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.జమ్మి పూజ అనంతరం ఆలయ ప్రాంగణంలో దసరా వేడుకలు ప్రారంభమయ్యాయి.విజయదశమి పండుగ సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన



విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.దసరా పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. జమ్మి పూజకు హిందూ సంప్రదాయంలో ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, ఈ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.పండుగలు ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నల్గొండ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కార్పొరేటర్ అబ్బగోని కవిత రమేష్ గౌడ్, పలువురు కార్పొరేటర్లతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మర్రిగూడలో ఘనంగా దసరా పండుగ వేడుకలు.

నల్లగొండ పట్టణ పరిధిలోని 13 డివిజన్ మర్రిగూడ గ్రామంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మాజీ జడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ గుమ్ముల జానకి మోహన్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో ఘనంగా దసరా సంబురాలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట పట్టణంలో దసరా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జమ్మిగడ్డలోని జెడ్పి కార్యాలయం లో ఏర్పాటు చేసిన జమ్మి వృక్షం వద్ద జరిగిన శమిపూజ లో మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి., మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి లు పాల్గొన్నారు. అనంతరం దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై నుంచి పావురాలు, బెలూన్లు గాల్లోకి ఎగురవేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో దసరా పండుగ ఆనందాన్ని నింపాలని అన్నారు. సూర్యాపేట పట్టణం నుండి ప్రజలు పెద్దసంఖ్యలో జమ్మిగడ్డ కు విచ్చేసి శమిపూజలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు 48 వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ , మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ , మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ,కౌన్సిలర్ లు , నాయకులు పాల్గొన్నారు

తక్కువ నీటితో పండే పంటలపై దృష్టి పెట్టాలి

*** మాందాపురంలో రైతులతో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్ ముఖాముఖి**



వలిగొండ, ప్రజాస్ఫూర్తి:ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను తట్టుకునేందుకు రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్ సూచించారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం మాందాపురంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు.వాతావరణ మార్పులు, సాగునీటి అవసరాలు, వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు.అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. దీంతో భూగర్భ జలాల వినియోగం తగ్గడంతో పాటు వ్యవసాయ విద్యుత్ ఆదా అవుతుందని వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. సీఎండీ సూచనలపై రైతులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో టీజీఎన్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్.నరసింహులు, రూరల్ జోన్ చీఫ్ ఇంజినీర్ యు.బాలస్వామి, యాదాద్రి ఎస్ఈ కె.సురేష్ కుమార్, చౌటుప్పల్ డీఈ డి.మల్లికార్జున్, ఎంఆర్‌టీ డీఈ విజయభాస్కర్ రెడ్డి, రామన్నపేట ఏడీఈ కె.శ్రీకాంత్, ఏఈ జోగుల నర్సింహా, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

జై భవాని నినాదాలతో తొలిసారి కొలువైన దుర్గమ్మ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ పట్టణంలోని హోలీయ దాసరి బజార్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా, సహాయ యూత్ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు.ఈ సందర్భంగా నిర్వహించిన చీరల వేలంపాట, ఊహించని విధంగా విజయవంతమైంది.అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి,జై భవాని నినాదాలతో ఓలియాదాసరి బజార్ ను మార్మోగించారు.భవాని స్వాములు అందరితో కలిసి,అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోలీయ దాసరి బజారుకు చెందిన భక్తులు ప్రముఖులు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిగా ఉప్పలమ్మ దర్శనం



జనగామ,ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని అమ్మబావి వద్ద ఉన్న ఉప్పలమ్మ సహిత ఆంజనేయస్వామి దేవాలయంలో దే వీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొన సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా ప్ర త్యేకంగా అలంకరించి భక్తులకు దర్శ నం కల్పించారు. దేవాలయ పూజారి వారణాసి పవన్ శర్మ ఆధ్వర్యంలో ప్ర త్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించా రు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధల తో పూజలు నిర్వహించారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే

వలిగొండ, ప్రజాస్ఫూర్తి :వలిగొండ మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం నిర్మాణానికి గాను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్థల పరిశీలన చేశారు బుధవారం ఆయన తన నివాసంలో అన్ని పార్టీల నాయకులు గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించి ఆలయాన్ని ఎక్కడ నిర్మిద్దామని సమాలోచనలు చేశారు ఇప్పటివరకు మెయిన్ రోడ్డు పక్కన కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ దేవాలయం రోడ్డు వెడల్పు కార్యక్రమం తో దేవాలయాన్ని వేరే ప్రాంతంలో నెలకొల్పాలసి వస్తుంది రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నందున ఆలయం రోడ్డు పక్కనే ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది అంతేగాక ఇట్టి పనులకు ఆలయం అడ్డుగా ఉండడంతో కొత్త స్థలంలో ఆలయాన్ని నిర్మించాలని ఏకాభిప్రాయానికి వచ్చారు సమావేశం అనంతరం పలు పార్టీ నాయకులు గ్రామస్తులతో కలిసి చెరువు ప్రక్కన కాటమయ్య గుడి ఎదురుగా స్థలం అణువుగా ఉండడంతో ఇక్కడే ఆలయాన్ని నిర్మించాలని



ఎమ్మెల్యే తో పాటు గ్రామస్తులు నిర్ధారణకు వచ్చారు ఊరి చివరలో విశాలమైన వాతావరణంలో ఆలయాన్ని నిర్మిస్తే భక్తులకు ఇబ్బంది లేకుండా ఉండడంతో పాటు ఆలయ ఆదాయం కూడా పెరుగుతుందని అందరి అభిప్రాయాలు ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి తెలియజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అందరి భాగస్వామ్యంతో ఇదే ప్రాంతంలో నూతన ఆలయాన్ని నిర్మిద్దాం అనే ఆలోచనకు వచ్చారు ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు వలిగొండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు నాయకులు చెట్టెడి జనార్దన్ రెడ్డి బత్తిని లింగయ్య గౌడ్ గుండు దానయ్య పబ్బు సురేందర్ కాసుల వెంకన్న బత్తిని నాగేష్ కొండూరు సాయి గ్రామస్తులు ఉన్నారు

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేం

ఆదిలాబాద్ జిల్లా ,ప్రజాస్ఫూర్తి :శాంతి భద్రతల పరిరక్షణ మరియు దేశ సరిహద్దు రక్షణ కోసం విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు ఫ్లాగ్ డే (అమరవీరుల సంస్మరణ దినోత్సవం) బుధవారం జిల్లాలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో గల అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నిర్వహించారు. అమరవీరుల స్తూపం వద్ద జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్ రావు, కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, న్యాయమూర్తి హుస్సేన్ నాయక్, అదనపు ఎస్పీ పి మౌనిక, ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, ఇతర శాఖల ఉన్నతాధికారులు పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యంగా అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛాలతో స్తూపం వద్ద నివాళులర్పించారు. జిల్లా పోలీసు యంత్రాంగం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే సందర్భంగా భారీ ఏర్పాట్ల మధ్య అమరవీరులను మనస్ఫూర్తిగా స్మరించుకున్నారు. దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం, దేశ రక్షణలో, విధి నిర్వహణలో అసువులు బాసిన 154



మంది పోలీసు సిబ్బంది, అధికారుల పేర్లను అదనపు ఎస్పీ పరిపాలన పి మౌనిక ఐపీఎస్ చదువుతూ స్మరించుకున్నారు. మొదటగా అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ పుష్పగుచ్ఛాలతో కలిసి స్తూపం వద్ద, అమర జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు అమరవీరులకు సలామి శస్త్ర ద్వారా గౌరవ వందనాన్ని సమర్పించి, ఆయుధాలను తలకిందులుగా చేసి 'శోక్ శస్త్ర'శ్రద్ధాంజలి ఘటించి, ద్వారా రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులను స్మరించుకున్నారు. తదుపరి అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించే దిశగా జిల్లా పరిపాలన, పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తాందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు రెండవ బెటాలియన్ కమాండెంట్ బి వెంకటేశ్వర రెడ్డి, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్ర వర్ధన్, ఆదిలాబాద్ జిల్లా సర్కిల్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, రెండవ బెటాలియన్ అధికారులు, ఇతర శాఖల ఉన్నతాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా విజయదశమి వేడుకలు

ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :ఆదిలాబాద్ పట్టణంలో విజయదశమి వేడుకలను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలో 50 ఏళ్లకు పైగా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ ఎంపీ గూడెం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం దస్నాపూర్‌లో నిర్వహించిన రావణ దహన కార్యక్రమానికి హాజరయ్యారు. దస్నాపూర్‌లో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ విజయానికి ప్రతీకగా భావించే శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా పట్టా పాస్ పుస్తకాలను, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆయుధాన్ని చేత పట్టి, పూజలు నిర్వహించారు.




జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మఠాధిపతి యోగానంద సరస్వతి సమక్షంలో షమీ చెట్టు పూజా కార్యక్రమాలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రామబాణంతో రావణుడి బొమ్మను వెలిగించి రావణ దహన కార్యక్రమాన్ని పూర్తి చేశారు.ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ,జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నేతలు



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి :బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, బి ఆర్ ఎస్ పార్టీ విప్ కెపి. వివేకానంద్ గౌడ్ జన్మదినం సందర్భంగా బుధవారం పేట్ బషీరాబాద్ ఉన్న తన కార్యాలయం వద్ద ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలలో బీ ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మైనార్టీ సెల్ అధ్యక్షుడు మక్సూద్ అలీ, భగత్ సింగ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పశ్చిమట్ల నరేందర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రతాపరెడ్డి, మాజీ అధ్యక్షుడు చింతల్ అశోక్ ,జై గౌడ్ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి, కే పి వి అభిమాని బిసు వెంకటేశం గౌడ్, మిక్సర్ రాములు, కే ఎల్లేష్, దుర్గేష్ ,తదితరులు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొని శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

రైలు ఢీకొని యువకుడు దుర్మరణం



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రం లోని బీరప్పగడ్డ ప్రాంతానికి చెందిన జంపయ్య అనే యువకుడు బుధవా రం రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, జంపయ్య రోజువారీగా మేకల ను మేపేందుకు రైల్వే ట్రాక్ పరిసర ప్రాం తానికి వెళ్లాడు. ఈ క్రమంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయా లపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పో యాడు. యువకుడి ఆకస్మిక మృతితో బీరప్పగడ్డ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.సమాచారం అందు కున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థ లానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైంసాలో దుర్గమ్మ హారతిలో పాల్గొన్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్



ప్రజాస్ఫూర్తి,భైంసా:నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలో దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన హారతి కార్యక్రమంలో ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న దుర్గామాత నిమజ్జన వేడుకల్లో భాగంగా ఆయన భక్తిశ్రద్ధలతో హారతిలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని, దుర్గమ్మ ప్రజలందరినీ చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు.రైతులకు మంచి పంటలు పండి, ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా జీవించాలని, దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు గత రాత్రి ఇంద్రవెల్లి మండలంలోని పాడుబడ్డ మిట్టల్ జిన్నింగ్ ప్రాంగణంలో పేకాట ఆడుతున్న స్థావరంపై ఆదిలాబాద్ టాస్క్ ఫోర్స్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని బృందం దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో పేకాట ఆడుతున్న 14 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్దనుంచి రూ.2,24,100 నగదు, 14 మొబైల్ ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్పీ తెలిపారు. నిందితులను విచారించగా, స్థల యజమానికి తెలిసే అక్కడ పేకాట ఆడినట్లు వెల్లడించడంతో సదరు యజమాని గోరేసేట్ పై సైతం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయండి అనే విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, గంజాయి, అక్రమ కార్యకలాపాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే ప్రజలు నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని ఎఎస్పీ సూచించారు. ఇందుకోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ నేరుగా పర్యవేక్షించే వాట్సాప్ నంబర్



8712659973 కు సమాచారం పంపవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారితో పాటు వాటికి సహకరించే వారిపైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే హెచ్చరించారు.

సాయి చరణ్ వైద్య విద్యకు మేమున్నాం

ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :పేదరికం కారణంగా వైద్య విద్యను కొనసాగించలేని పరిస్థితిలో ఉన్న బోథ్ మండల కేంద్రానికి చెందిన సాయి చరణ్‌కు పలువురు వైద్యులు అండగా నిలిచారు. అతడి వైద్య విద్యకు అయ్యే పూర్తి ఖర్చును భరించేందుకు ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. బోథ్ సీహెచ్‌సీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర ప్రసాద్ సాయి చరణ్ ఆర్థిక పరిస్థితిని గాంధీ వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు డాక్టర్ రోహిణి వంగ (అమెరికా), డాక్టర్ విక్రమ్ రెడ్డిలకు వివరించారు. దీంతో స్పందించిన డాక్టర్ రవీంద్ర ప్రసాద్, డాక్టర్ రోహిణి వంగ, డాక్టర్ విక్రమ్ రెడ్డిలు సాయి చరణ్ వైద్య విద్యకు అయ్యే ఖర్చును



భరించేందుకు ముందుకొచ్చారు. ఈ క్రమంలో దాదాపు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు అంగీకరించారు. ఇందులో భాగంగా బుధవారం బోథ్ మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఉన్న దుర్గామాత ఆలయం ,శారదాదేవి విగ్రహం వద్ద రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర ప్రసాద్, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి మాట్లాడుతూ పేద విద్యార్థి సాయి చరణ్ వైద్య విద్యను పూర్తి చేసేందుకు తామంతా అండగా ఉంటామని తెలిపారు. తమ కుమారుడి వైద్య విద్యకు అయ్యే ఖర్చును భరించేందుకు ముందుకొచ్చిన వైద్యులకు సాయి చరణ్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. తమ బిడ్డ భవిష్యత్తుకు భరోసా లభించడంతో వారు భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉపాధ్యాయులు, బుడగ జంగం కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులత్యాగం చిరస్మరణీయం

*** జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



ప్రజాస్ఫూర్తి,భైంసా: నిర్మల్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి,అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.దేశ సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని రక్షిస్తే, రాష్ట్రంలో అంతర్గత భద్రతను కాపాడుతూ ప్రజలకు భరోసా కల్పించేది పోలీసులని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల రక్షణలో పోలీసులు అహర్నిశలు విధులు నిర్వహిస్తున్నారని, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది అమరవీరుల స్మారక స్థూపానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ పి. శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

*** అమ్మవారి వేషాధారణలో ఆకట్టుకున్న చిన్నారి కృతిక**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఎంతో ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న అమ్మవారు గంగమ్మ ఒడికి చేరుకున్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ రామవరంలోని శ్రీ సీతారామ హనుమాన్ శివాలయం



ప్రాంగణంలో నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్తర భారతీయ హిందువులు కులమతాలకు అతీతంగా ఈ వేడుకల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని



ఆరాధించారు. ఉత్సవాల ప్రారంభం నుంచి భక్తులు భవానీ మాలలు ధరించి, దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారికి ప్రీతిపాత్రమైన గోధుమ విత్తనాలను బుట్టలో చల్లి పూజలు చేశారు. అవి మొలకెత్తిన అనంతరం మహిళలు వాటిని తలపై ధరించి, ఊరేగింపుగా అమ్మవారి నిమజ్జన కార్యక్రమానికి బయలుదేరడం ఆనవాయితీగా వస్తోంది. విజయదశమి సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో దుర్గామాతకు ప్రత్యేక హోమ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని జమ్మి చెట్టు వద్ద ప్రధానార్చకులు శ్రీధరాచార్యులు, గిరిధరాచార్యుల ఆధ్వర్యంలో శమీ పూజ జరిపించారు. దుర్గామాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు చేశారు.

*** అచ్చం 'అమ్మ'వారిలాగే..**

శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు, విజయదశమి సందర్భంగా దుర్గామాత అమ్మవారి ఊరేగింపు ఎంతో ఘనంగా జరిగింది. ఈ క్రమంలో అచ్చం అమ్మవారి వేషాధారణతో చిన్నారి కృతిక అందరినీ ఆకట్టుకుంది. దుర్గామాత విగ్రహం ముందు అమ్మవారి రూపంలో ఉన్న చిన్నారి కృతికను చూసి భక్తులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. అమ్మవారిలా అలంకరించుకుని, అమ్మవారి ఆహార్యంతో అందరినీ ఆకట్టుకున్న చిన్నారిని చూసి పలువురు చేతులు జోడించి నమస్కరించారు.

పాతికేళ్ల సంప్రదాయానికి ఆపన్నహస్తం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి;ఉప్పరపల్లి గ్రామంలో యువత యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 26 ఏళ్లుగా కొనసాగుతున్న రావణ వధ కార్యక్రమానికి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సమ్మయ్యగౌడ్ అండగా నిలిచారు. ఈ ఏడాది రావణ వధ ప్రతిమను విరాళంగా అందించారు. సమ్మయ్యగౌడ్ మాట్లాడుతూ యువత ఐక్యంగా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడం సంతోషకరం. ఉప్పరపల్లిని సొంత గ్రామంగా భావిస్తాను. సేవా కార్యక్రమాలకు నా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది.యూత్ అధ్యక్షుడు తండ శ్రీనివాస్ మాట్లాడుతూ 26 ఏళ్లుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. దాతల సహకారం మరువలేనిది. గత ఏడాది, ఈ ఏడాది కూడా సమ్మయ్యగౌడ్ ప్రతిమను ఇచ్చి ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో నూకల వెంకటేశ్వర్లు, జెనిగల అనిల్, బోనగిరి జ్యోతి రమేష్,కంచ రాజు, పలుస పద్మ వెంకన్న, తండ సంపత్, బండరు దయాకర్, తండ వెంకటేశ్వర్లు, ఎటురోజు సత్యనారాయణ, నాలాగుర్తి ఉప్పలయ్య,కట్ల పాపయ్య,పబ్బతి సారంగం,శాగంటి రాములు,అడపా రమేష్,బేకుల శ్రీకాంత్,ఎం.డి. షబ్బీర్,గుండా కమలాకర్,కార్తీక్, రాజేష్,అల్లావుద్దీన్, రహీమ్,నగేష్, రాంబాబు,కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మమే గెలుస్తుందని చాటే పండుగ విజయదశమి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:పట్టణంలో నిర్వహించిన విజయదశమి వేడుకల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి రమేష్ నాయక్ పాల్గొని,జమ్మి చెట్టుకు పూజలు చేసి,రావణ వధ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. ధర్మం,నిజాయితీతో ముందుకు సాగాలి" అని తెలిపి, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి రమేష్ నాయక్ మాట్లాడుతూ, "రావణ వధ ద్వారా చెడును విడనాడి, మంచిని ఆచరించాలనే సందేశం ప్రజల్లోకి వెళ్తుంది. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలి" అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పూర్ణపు సోమయ్య,డీఈ ఉపేందర్,మేనేజర్ అంకుషావలి,ఫ్లోర్ లీడర్లు,36 వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్,పోలీసు అధికారులు,భక్తులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు ఘన నివాళులు

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ శ్రీనివాసరావు**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా:శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.బుధవారం పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెదక్ ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, తోకలిసి కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు.ముందుగా పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు.రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, విధులను నిర్వహిస్తూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని కలెక్టర్ గుర్తు చేశారు. వ్యాచారచన పోటీలలో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ,సిఐలు, ఎస్త్సెచ్ఓ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి పత్తి కొనుగోళ్లు



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో 2026-27 పత్తి సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళ్లు గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సీసీఐతో పాటు ప్రైవేటు వ్యాపారుల ఆధ్వర్యంలో కొనుగోళ్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.రైతులు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు పత్తిని విక్రయించుకునేలా నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన పత్తిని మార్కెట్‌యార్డుకు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పత్తి విక్రయానికి ముందుగా 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు.కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పత్తి నాణ్యత, తేమ తదితర అంశాల్లో రైతులు నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు.పత్తి కొనుగోళ్ల ప్రారంభ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, పత్తి వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు, మార్కెట్ కమిటీ అధికారులు, హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

సుందరగిరిలో ఉత్సాహంగా సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్

*** విజేతలకు బహుమతులు అందజేసిన సర్పంచ్ జంగ శిరీష రమణరెడ్డి**



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి:బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సుందరగిరి బతుకమ్మ ఘాట్ వద్ద సుందరగిరి సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం కావడానికి పూర్తి సహాయసహకారాలు అందించిన సుందరగిరి గ్రామ సర్పంచ్ జంగ శిరీష రమణరెడ్డిని సుందరగిరి క్రికెట్ టీం సభ్యులు ఘనంగా సన్మానించి,తమ కృతజ్ఞతలు తెలియజేశారు.హోరాహోరీగా సాగిన ఈ టోర్నమెంట్‌లో వినోద్ లెవెన్ టీం ప్రథమ విజేతగా నిలవగా,ఓజి టీం ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది.విజేతలకు ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ జంగ శిరీష రమణరెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.ప్రథమ విజేతకు రూ 4వేల నగదుతోపాటు ట్రోఫీని,ద్వితీయ విజేతకు రూ. 2వేల నగదుతో పాటు ట్రోఫీని బహూకరించారు.ఈ కార్యక్రమంలో సుందరగిరి క్రికెట్ టీం సభ్యులు గందే సాయినాథ్, వినోద్, సాగర్, లడ్డు, రమేష్, మహేష్, సతీష్ బాబు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు, మానసిక వికలాంగులకు పండ్లు, బిస్కెట్స్ అందజేత



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి హ్యాట్రిక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ఎల్పీ విప్ కెపి వివేకానంద్ జన్మదినం సందర్భంగా బుధవారం గండిమైసమ్మలోని పల్లవి ఆశ్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర హైదరాబాదు శాఖ చైర్మన్ ఏవి రావు, ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ బండారి సాయికుమార్, వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండర్ నారాయణరావు ఇక్కుర్తి లు సందర్శించి వయోవృద్ధులకు, మానసిక వికలాంగులకు పండ్లు, బిస్కెట్స్ అందజేశారు. మానసిక వికలాంగురాలు వివేకానంద జన్మదిన సందర్భంగా నడవలేదు, చూడలేదు, కానీ వివేకానంద్ గురించి నాలుగు ముచ్చట్లు చెప్పగానే పాట పాడి అందరినీ అల్లరించారు. ఈ కార్యక్రమంలో శివ, సాయిలు పల్లవి ఆశ్రమ నిర్వాహకురాలు పాల్గొన్నారు

స్వచ్ఛంద సేవకుడికి గౌరవ డాక్టరేట్ రావడం పట్ల చిన్ననాటి మిత్రుల హర్షం

*** శ్రీనివాస్ కు 2000-01వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఘనసన్మానం**

చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి: తమ చిన్ననాటి మిత్రుడు సమాజానికి చేసిన విశేష సేవలను గుర్తిస్తూ పత్తేం శ్రీనివాస్ కు గౌరవ డాక్టరేట్ రావడం పట్ల 200001వ పదవ తరగతి మిత్రులు తీవ్ర సంతోషంతోపాటు గర్వంగా ఉందన్నారు.మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన శ్రీనివాస్ తమతోపాటు చదువుకున్న స్నేహితుడు విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత కూడా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించడం అభినందనీయమన్నారు.సమాజంలో వెనుకబడిన వర్గాలకు ఆయన అందించిన సహాయసహకారాలు,వివిధ సందర్భాల్లో చేపట్టిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు ఎందరికో ఆదర్శంగా



నిలిచాయని కొనియాడారు. ఇంటర్ చదువుతున్నప్పటినుంచి ఎన్ఎస్ఎస్ వాలంటరీగా, డిగ్రీలో స్వచ్ఛంద కార్యక్రమాలు చేపడుతూనే జర్నలిస్టులగా సేవలందిస్తున్నారని చెప్పారు.కష్టాల్లో ఉన్నవారిని ఆదుకుంటూ,నిరంతరం సేవా పథంలో సాగుతున్న తమ మిత్రుడికి ఈ గౌరవ డాక్టరేట్ దక్కడం అత్యంత గౌరవమని పేర్కొన్నారు.ఈ పురస్కారం తమ పదవ తరగతి బ్యాచ్‌కే కాకుండా,వారి ప్రాంతానికి కూడా ఎంతో గర్వకారణమని మిత్రులంతా కలిసి తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో గందె సంజీవ్,బొల్లబత్తిని శ్రీనివాస్,చిట్టెంపల్లి మహేందర్,గంధం శ్రీనివాస్,తులాల శేఖర్,కక్కర్ల రమేష్,బొల్లి శ్రీనివాస్,కుంట గోపాల్,కంది రమేష్,బాకం సంతోష్, కక్కర్ల ప్రశాంత్,కక్కెర్ల మహేందర్,మెడబోయిన సాంబరాజు, పెరుగు నాగరాజు,గైని శ్రీనివాస్, కర్రబత్తుల నాగరాజు,గుండెకారి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబిబిఎస్ లో సీటు సాధించిన పొనకల్ గ్రామ విద్యార్థిని

ప్రజాస్ఫూర్తి ,జన్నారం:జన్నారం మండలంలోని పొనకల్ గ్రామ విద్యార్థిని కొత్తూరి చిన్మయి మూడవ విడత కౌన్సిలింగ్ లో ఎంబిబిఎస్ సీటు వచ్చినట్లు బుధవారం కుటుంబసభ్యులు తెలిపారు. విద్యార్థిని తండ్రి బాస్కర్ గతంలో జన్నారం పోలిస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విదులు నిర్వర్తించారు.



ఈ విద్యార్థిని విద్యాభ్యాసం బెల్లంపల్లి, హైదరాబాద్ లో చదివిందని, తమ కూతురికి ఏంబిబిఎస్ సీటు రావడం చాలా సంతోషంగా వున్నదని తల్లి దండ్రులు తెలిపారు. మండల విద్యార్థి నికి ఈ సీటు రావడం పట్ల తన తోటి విద్యార్థులు బంధువులు పలువురు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

మండల కేంద్రంలో వైభవంగా దుర్గామాత నిమజ్జనం వేడుకలు



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి:చిగురుమామిడి మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ప్రతిష్టించిన దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని యువత బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో మండల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సర్పంచ్ అకవరం భవాని శివప్రసాద్,బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ కాశబోయిన విజయలక్ష్మి రాజు యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, వార్డు సభ్యులు చెరుకు చిన్న సమ్మయ్య,బూరుగు లావణ్య శ్రీకాంత్,మాజీ రైతుబంధు సమితి అధ్యక్షులు పెనుకుల తిరుపతి తదితరులు హాజరై అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా నిర్వహించారు.ముఖ్య అతిథుల చేతుల మీదుగా చిట్టీలు తీయించి,విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చకిలం శ్రీనివాస్, అధ్యక్షులు కాశబోయిన రాజు,ప్రధాన కార్యదర్శి పెనుకుల తిరుపతి, ఉపాధ్యక్షులు గుడుగుల అంజనేయులు, కమిలికారి శ్యాంసుందర్, కోశాధికారి వడ్లూరి నరేష్, కార్యవర్గ సభ్యులు మిలుగుల శ్రీనివాస్, అనుపోజు చిరంజీవి, ముక్కెర సదానందం,మినుగుల నరసింహులు,పొగాకుల రమేష్, పెనుకుల శ్రీనివాస్,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వీరుల స్ఫూర్తితో సేవలకు పిలుపు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు.జిల్లా ఎస్పీ డా. శబరీష్, కలెక్టర్ స్నేహా శబరీష్, అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించి,మౌనం వహించారు.ఎస్పీ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్ లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద అమరులైన పది మంది పోలీసుల త్యాగానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.గత ఏడాది విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా 154 మంది,తెలంగాణలో నలుగురు అమరులయ్యారని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ, డీఎస్పీలు,పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో హత్యాయత్నం, నలుగురు నిందితుల అరెస్ట్

వలిగొండ, ప్రజాస్ఫూర్తి:వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలో దసరా పండుగ సందర్భంగా జరిగిన ఘర్షణలో ఒక యువకుడిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నలుగురు నిందితులను వలిగొండ పోలీసులు అరెస్ట్ చేశారు.ఈనెల 20న రాత్రి సుమారు 11:00 గంటల సమయంలో ప్రొద్దుటూరు గ్రామంలోని దసరా పండుగ సందర్భంగా కొందరు యువకులు సౌండ్ బాక్సులతో నృత్యాలు చేస్తుండగా, గతంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఏర్పడిన పాత కక్షల నేపథ్యంలో పెద్దబోయిన నవీన్, పెద్దబోయిన అజయ్, పెద్దబోయిన గోపాల్, గజ్జి మహేష్‌లు అక్కడికి వచ్చి సౌండ్ బాక్సులను తన్ని గొడవకు దిగారు. అనంతరం అదే రాత్రి తిరిగి అక్కడికి వచ్చిన నిందితుల్లో పెద్దబోయిన నవీన్ అను వ్యక్తి కత్తితో పెద్దబోయిన వెంకటేష్‌పై వెనుక భాగంలో పొడవడంతో తీవ్ర రక్తగాయమైంది. ఈ ఘటనపై బాధితుడి తండ్రి పెద్దబోయిన కాంతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వలిగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులను రిమాండ్కు తరలించారు ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూగ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఘర్షణలకు పాల్పడినా, మారణాయుధాలతో దాడులకు దిగినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . ప్రజలు పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకొని పోలీసులకు సహకరించాలి, ఎవరైనా గొడవలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు

కొవ్వొత్తుల ర్యాలీతో పోలీసు అమరవీరులకు ఘన నివాళి

*** డీసీపీ రాజా మహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ.**



జనగామ,ప్రజాస్ఫూర్తి : పోలీసు అమర వీరుల వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రం లో బుధవారం పోలీసు అమర వీరులను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. డీసీపీ రాజా మహేంద్ర నాయక్ ఐపీఎస్ ఆధ్వర్యం లో జనగామ పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఈ ర్యాలీలో పాల్గొని విధి నిర్వహణలో ప్రా ణత్యాగం చేసిన పోలీసు అమర వీరు లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాల ను స్మరించుకుంటూ, ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం వారు చేసిన సేవలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పోలీ సు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తెలిపారు.

మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి :18 సం"ల లోపు పిల్లలు మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికాకుండా జిల్లాలో మైనర్ డ్రైవింగ్ చేసిన వారికి, వారి తల్లిదండ్రులకు మంగళవారం స్థానిక పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్యఅతిథిగా పాల్గొని తల్లిదండ్రులకు, యువతకు, మైనర్లకు అవగాహన కార్యక్రమం,కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ చేయడం నేరమని, పదేపదే అవగాహన కల్పిస్తున్న వినిపించుకొని వారి పై చట్టరీత్యా ఇకనుండి కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. మైనర్లకు డ్రైవింగ్ ఇచ్చిన వాహన యజమానులు, తల్లిదండ్రులు కేసులలో భాగస్వామ్యం అవుతారని తెలిపారు. ఒకవేళ మైనర్ తెలియక ప్రమాదాలకు కారణమైతే ఇన్సూరెన్స్ రాకుండా పోతుందనే విషయాన్ని తెలియజేశారు. కుటుంబ సభ్యులు 18 సంవత్సరాల పైబడిన పిల్లలకు డ్రైవింగ్ లైసెన్సును తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దసరా సెలవుల సందర్భంగా వారం రోజులపాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో 376 మైనర్లు వాహనాలతో పట్టుబడ్డారని, అందులో ఆదిలాబాద్ సబ్ డివిజన్ కి సంబంధించిన 245 వాహనాలు ఉట్నూర్ సబ్ డివిజన్ కి చెందిన 131 వాహనాలు ఉన్నట్లు, వాహనాలను సీజ్ చేయడం జరిగిందని, ప్రస్తుతం వారి తల్లిదండ్రులకు వాహనాలపై ఉన్న ఫైన్ పూర్తి చేసిన తర్వాత వాహనాలను తిరిగి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వారందరి తల్లిదండ్రులకు 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు నడిపే శక్తి ఉండదని, వారు ప్రమాదానికి గురి కావచ్చు లేదా వారి ద్వారా ఇతరులకు ప్రమాదం సంభవించవచ్చు అని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ వయస్సును నిర్ణయించిందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రాత్రిపూట, రోడ్లపై అనవసరంగా తిరగకుండా ఉండాలని గమనించాలని తెలిపారు.మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమై ప్రాణ నష్టం సంభవిస్తుందని, లేదా సరిగ్గా వాహనాలు నడిపే వారి కి ప్రమాదం చేసి వారి ప్రాణాలకు, కుటుంబ సభ్యులకు హాని కలిగించే విధంగా చేస్తున్నారని, ప్రజాస్ఫూర్తి :18 సం"ల లోపు పిల్లలు మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికాకుండా జిల్లాలో మైనర్ డ్రైవింగ్ చేసిన వారికి, వారి తల్లిదండ్రులకు మంగళవారం స్థానిక పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్యఅతిథిగా పాల్గొని తల్లిదండ్రులకు, యువతకు, మైనర్లకు అవగాహన కార్యక్రమం,కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ చేయడం నేరమని, పదేపదే అవగాహన కల్పిస్తున్న వినిపించుకొని వారి పై చట్టరీత్యా ఇకనుండి కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. మైనర్లకు డ్రైవింగ్ ఇచ్చిన వాహన యజమానులు, తల్లిదండ్రులు కేసులలో భాగస్వామ్యం అవుతారని తెలిపారు. ఒకవేళ మైనర్ తెలియక ప్రమాదాలకు కారణమైతే ఇన్సూరెన్స్ రాకుండా పోతుందనే విషయాన్ని తెలియజేశారు. కుటుంబ సభ్యులు 18 సంవత్సరాల పైబడిన పిల్లలకు డ్రైవింగ్ లైసెన్సును తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దసరా సెలవుల సందర్భంగా వారం రోజులపాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో 376 మైనర్లు వాహనాలతో పట్టుబడ్డారని, అందులో ఆదిలాబాద్ సబ్ డివిజన్ కి సంబంధించిన 245 వాహనాలు ఉట్నూర్ సబ్ డివిజన్ కి చెందిన 131 వాహనాలు ఉన్నట్లు, వాహనాలను సీజ్ చేయడం జరిగిందని, ప్రస్తుతం వారి తల్లిదండ్రులకు వాహనాలపై ఉన్న ఫైన్ పూర్తి చేసిన తర్వాత వాహనాలను తిరిగి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వారందరి తల్లిదండ్రులకు 18 సంవత్సరాల లోపు పిల్లలకు వాహనాలు నడిపే శక్తి ఉండదని, వారు ప్రమాదానికి గురి కావచ్చు లేదా వారి ద్వారా ఇతరులకు ప్రమాదం సంభవించవచ్చు అని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ వయస్సును నిర్ణయించిందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రాత్రిపూట, రోడ్లపై అనవసరంగా తిరగకుండా ఉండాలని గమనించాలని తెలిపారు.మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమై ప్రాణ నష్టం సంభవిస్తుందని, లేదా సరిగ్గా వాహనాలు నడిపే వారి కి ప్రమాదం చేసి వారి ప్రాణాలకు, కుటుంబ సభ్యులకు హాని కలిగించే విధంగా చేస్తున్నారని, అండ్ డ్రైవ్ చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పిఎల్ జీవన్ రెడ్డి, ఎ ఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, పట్టణ సీఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, వెంకటేశ్వర్లు, రహీం పాషా, ట్రాఫిక్ ఎస్ఐ లు దేవేందర్, మనీష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో ఎమ్మెల్యే కుంభం దసరా సందడి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి:విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తన స్వగ్రామమైన వలిగొండలో సతీమణి కిరణ్‌జ్యోతితో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా జమ్మి పూజ నిర్వహించి పండుగ సంబరాలను జరుపుకున్నారు.విజయదశమి సందర్భంగా జమ్మి పూజ నిర్వహించిన అనంతరం జమ్మి ఆకులను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం మన సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన ఆచారమని పేర్కొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన నాయకులు, ప్రముఖులు, గ్రామస్థులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.స్వగ్రామంలో కుటుంబ సభ్యులు, గ్రామస్థుల మధ్య ఎమ్మెల్యే దసరా వేడుకల్లో పాల్గొనడంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. అదేవిధంగా బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన రావణ కాష్టం కార్యక్రమంలో పాల్గొని రావణ దహనం చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు సింగిల్ విండో చైర్మన్ గరిసె రవి మండల నాయకులు బత్తిని లింగయ్య గౌడ్ కాసుల వెంకన్న గౌడ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు

*** వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**



ప్రజా స్ఫూర్తి, సూర్యాపేట: పెన్ పహాడ్ మండలంలోని అనాజిపురం గ్రామంలో దసరా ఉత్సవాల్లో భాగంగా మత్స్యకారులు ఆనవాయితీగా నిర్వహించే సంప్రదాయ యాట బలి కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి సంప్రదాయ వేడుకల్లో పాల్గొని, గ్రామ ప్రజల ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ వారితో ఆత్మీయంగా మమేకమయ్యారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇలాంటి వేడుకలు గ్రామీణ ఐక్యతను, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మిడిమేలకు దామోదర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ అనుములపూరి నాగయ్య, ఉపసర్పంచ్ చెన్ను భరత్ రెడ్డి, వార్డు సభ్యులు చెన్ను కృష్ణారెడ్డి, లింగమ్మ మల్లయ్య, ముస్తఫా, అనుములపూరి రాజు, లక్కపాక విలేకర్, మహిళా అధ్యక్షురాలు చెన్ను జయమ్మ, సీనియర్ నాయకులు నాంపల్లి సైదులు, దాసరి మట్టయ్య, మండల అగ్రికల్చర్ డైరెక్టర్ మట్టపల్లి వెంకట నర్సు, అధికార ప్రతినిధి కుందమల్ల శేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా నాయకులు వెన్న ఉపేందర్, కోడి కిరణ్, పిల్లల నాగరాజు, షేక్ నాసిర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాలనీలో అంబరాన్నంటిన దసరా సంబరాలు



ప్రజా స్ఫూర్తి ,షాద్‌నగర్ :షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో పాటు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకల్లో పాల్గొనడంతో పండుగ సందడి నెలకొంది. రావణ దహన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, చిన్నారుల నృత్యప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గత తొమ్మిది రోజులుగా హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో అమ్మవారి పూజలు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడంతో కాలనీ అంతటా భక్తిభావం వెల్లివిరిసింది. ప్రతిరోజూ భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న కాలనీ వాసులు ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు. ఉత్సవాల నిర్వహణలో నిర్వాహకులు బిక్షపతి, మురళి, మాజీ జెడ్పిటిసి సాయి కృష్ణ, గంగిరెడ్డి, కమ్మదానం సుధాకర్, అంబటి చంద్రశేఖర్, మురళి, ఏఆర్ రామరాజు, అరుణ్ కుమార్, భాస్కర్ గౌడ్, పంతులు కళ్యాణ్ శాస్త్రి, జయప్రకాశ్, వినయ్ కుమార్, నారాయణ రాజు కోరే, నరేష్. జైప్రకాష్. చైతన్యకృష్ణ, బాలబ్రహ్మచారి, సుశీల్, రమేష్ తో పాటు కాలనీ పెద్దలుపాల్గొన్నారు.

కనకం మైసయ్య మరణం తీరని లోటు

*** టీడబ్ల్యూయంఎఫ్ జిల్లా ఇంచార్జీ గుండా ఉపేందర్ రెడ్డి**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కనకం మైసయ్య అకాల మరణం పూడ్చలేని లోటని బిజెపి జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి అన్నారు. కూసుమంచి మండల కేంద్రంలో హతాన్మరణం పొందిన కనకం మైసయ్య పార్థీవ దేహానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉ పేం ద ర్ రె డ్డి మా ట్లా డు తూ మండలంలో ఏ గ్రామంలో నుంచైనా సమస్య ఉందని మైసయ్య కు విన్నవిస్తే ఆ సమస్య తనదిగా భావించి అందరికీ తగిన న్యాయం చేసిన వ్యక్తి అని చేసుకున్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ప్రార్థించడం జరిగింది. నివాళులు అర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసోజ్ వెంకన్న, వార్డు సభ్యులు చెరుకుపల్లి వీరయ్య, అర్వపల్లి ఉపేందర్,టీడీపీ నాయకులు గోవింద ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పాలకు కేరాఫ్ కేవీఆర్ డైరీ ఫామ్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:పట్టణంలోని 7వ వార్డు రాజాలిపేట శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన కేవీఆర్ డైరీ ఫామ్ ను ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్,మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ ప్రారంభించారు.ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ "పట్టణంలో ఇలాంటి డైరీ ఫామ్ ల ఏర్పాటు వల్ల స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది.ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన పాలు అందుబాటులోకి వస్తాయి"అని అన్నారు. ఈ కార్యక్రమంలో నీరుటి హైమా లక్ష్మీనారాయణ, ఘనపురపు అంజయ్య,జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు,బొల్లు రాజు,గాడిపెల్లి లావణ్య చరణ్,ఎడ్ల రమేష్,తోట సుభాష్,గోనే శ్యాం కుమార్,శ్రీదేవి,బాలు నాయక్,చిట్యాల జనార్ధన్, నిర్వాహకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అసిఫాబాద్‌లో గాలి బుడగల థియేటర్ పునఃప్రారంభం



ఆసిఫాబాద్,ప్రజా స్ఫూర్తి: జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గాలి బుడగల నిర్మాణంతో రూపొందించిన ఆధునిక సినిమా థియేటర్ పునఃప్రారంభమైంది. పిక్చర్ టైమ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సమన్వయంతో ఏర్పాటు చేసిన ఈ థియేటర్‌ను బుధవారం కలెక్టర్ కె.హరిత ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వినోద సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మహిళా సంఘాల సహకారంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు.పిక్చర్ టైమ్ థియేటర్‌లో ప్రేక్షకుల కోసం పుష్‌బ్యాక్ సీట్లు, ఏసీ, డాల్బీ సౌండ్ వంటి ఆధునిక సదుపాయాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆహార పదార్థాలు, పానీయాలు సైతం అందుబాటులో ఉంటాయని చెప్పారు. జిల్లా ప్రజలు, యువత, కుటుంబ సభ్యులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.జిల్లా అభివృద్ధిలో భాగంగా ప్రజలకు వినోదంతో పాటు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడం సానుకూల పరిణామమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

*** పండుగ రోజు ఎల్బీనగర్ లో విషాదం**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : మండల పరిధిలోని ఎల్బీనగర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే..... గరిడేపల్లి వైపు నుంచి నేరేడుచర్లకు వెళ్తున్న మోటార్ సైకిల్ ఎల్బీనగర్ గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎల్బీనగర్ గ్రామానికి చెందిన కాలువ సుజాత(50) దుర్గ మాత విగ్రహం వద్ద పూజ కోసం వెళ్తు రోడ్డు దాటుతున్న సమయంలో నేరేడుచర్ల పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న మండవ వెంకటేశ్వర్లు మోటార్ సైకిల్ పై వస్తూ ప్రమాదవశాత్తు ఢీకొనడంతో సుజాతకు తీవ్ర గాయాలయ్యాయి. మోటార్ సైకిల్ నడుపుతున్న కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కూడా గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సుజాతను మిర్యాలగూడ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా అక్కడ మృతి చెందింది. సుజాత భర్త కాల్వ వెంకటరమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమరవీరుల త్యాగాలే పోలీస్ శాఖకు స్ఫూర్తి

– పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఎస్పీ రోహిత్ రాజు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అమరవీరుల స్తూపం వద్ద విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు ''శోక్ శస్త్ర'' నిర్వహించి అమరవీరులకు గౌరవ వందనం సమర్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల పాటు మౌనం పాటించి వీరమరణం పొందిన పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. గత ఏడాది నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల పేర్లను ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తూ, విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. దేశ భద్రత, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఉగ్రవాదం, నక్సలిజం వంటి సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పి వెంకన్నబాబు, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్యా నాయక్, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి: పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లో విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ వారికి నివాళులు అర్పించారు.అనంతరం జగద్గిరిగుట్ట సీఐ ఎన్.సురేష్ మాట్లాడుతూ వారి త్యాగాలను గుర్తు చేసుకోని,దేశప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలు చిరస్మరణీయమన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దసరా పండుగ వేళ బంధించిన 4 పాలపిట్టలకు విముక్తి

: సీపీ సజ్జనార్



హైదరాబాద్: దసరా పండుగ సందర్భంగా కొందరు స్వార్థపరులు బోనుల్లో బంధించిన తెలంగాణ రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'లకు హైదరాబాద్ నగర పోలీసులు విముక్తి కల్పించారు. పౌరుల నుంచి అందిన పక్కా సమాచారంతో మూడు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, మొత్తం నాలుగు పాలపిట్టలను కాపాడినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. దసరా పండుగ నాడు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావించే సంప్రదాయాన్ని కొందరు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. మూగజీవాలను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని ముందుగానే హెచ్చరించినా, కొందరు వాటిని పెడచెవిన పెట్టారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద ఓ ఆలయం దగ్గర రెండు పాలపిట్టలను, ఛత్రినాక శ్రీ చిత్రగుప్త స్వామి ఆలయం వద్ద ఒకటి, మంగళ్‌హాట్ బాలాజీనగర్ ఆలయం సమీపంలో మరో పాలపిట్టను బోనుల్లో బంధించి ఉంచారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. తీవ్ర యాతనకు గురవుతున్న నాలుగు పాలపిట్టలను స్వాధీనం చేసుకుని, వాటిని కేబీఆర్ పార్క్ అటవీ శాఖ అధికారులకు సురక్షితంగా అప్పగించారు. ఈ ఘటనలకు పాల్పడిన నిందితులపై అటవీ శాఖ అధికారుల సమన్వయంతో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సజ్జనార్ తెలిపారు. "స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షిని పండుగ పేరుతో బంధించి, తిండి, నీరు లేకుండా హింసించడం ఎవరికీ మంచిది కాదు. బోనులోని పక్షి ఆర్తనాదాలతో శుభం ఎలా కనిపిస్తుంది? జీవుల పట్ల కరుణ చూపడమే నిజమైన భక్తి కానీ, ప్రకృతిని బంధించడం కాదు" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి అమానవీయ చర్యలను ఎవరూ ప్రోత్సహించవద్దని, వన్యప్రాణులకు హాని తలపెట్టే ఘటనలు ఎక్కడ జరిగినా వెంటనే 18004255364, 9803338666 లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అక్టోబర్ 22 నుండి 26 వరకు స్వర్ణ గిరిలో ఘనంగా పవిత్రోత్సవాలు

*** పలు వాహనాలపై దర్శనమివ్వనున్న స్వర్ణగిరీషుడు.**



భువనగిరి ,ప్రజాస్ఫూర్తి:తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ వైష్ణవ పుణ్య క్షేత్రమైన యాదాద్రి తిరుమల స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీ మన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళా శాసనాములతో, శ్రీమద్ ఉభయ వేదాంతా చార్య పీటం శ్రీరంగం వారి సాంప్రదాయ సలహాలు , సూచనలతో స్వర్ణ గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి పవిత్రోత్సవాలను అక్టోబర్ 22 నుంచి 26 వరకు ఐదు రోజులపాటు వైదిక క్రతువులు విశేష పూజలు ,పవిత్ర సమర్పణలు ,వాహన సేవలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు చైర్మన్లు మానేపల్లి మురళీ కృష్ణ గోపికృష్ణలు తెలిపారు. ఈ సందర్భంగా వారు బుధవారం మీడియాతో మాట్లాడుతూ సనాతన ధర్మ సాంప్రదాయంలో పవిత్రోత్సవాలకు విశేషమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందన్నారు. ఆలయంలో నిత్యం నిర్వహించే పూజలు , అర్చనలు , కైంకర్యాలు , తదితర ధార్మిక కార్యక్రమాలలో తెలిసి తెలియక సంభవించిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఆలయ పవిత్రతను మరింత పరిరక్షిస్తూ సర్వలోక క్షేమాన్ని ఆకాంక్షిస్తూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. స్వామివారి దివ్య అనుగ్రహం సమస్త భక్తజనులపై ప్రసరించాలని , ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ,సుఖశాంతులు సౌభాగ్యాలు కలగాలని ప్రార్థిస్తూ పవిత్రోత్సవాలను సంప్రదాయబద్ధంగా జరుపుతున్నట్లు తెలిపారు. వేదమంత్రాలు నడుమ జరిగే పవిత్ర క్రతువులు , హోమాలు విశేష అర్చనలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించనున్నాయని అన్నారు .స్వర్ణగిరీషుడు వివిధ వాహనాలపై కొలువుదీరి భక్తులకు దర్శనం ఇవ్వడం ఈ ఉత్సవాలలో మరో గొప్ప విషయమని, భక్తి వైదిక సాంప్రదాయం ఆధ్యాత్మిక వైభవాల సమ్మేళనంగా స్వర్ణగిరి క్షేత్రంలో ఐదు రోజులపాటు పండుగ వాతావరణం సంతరించుకుంటున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పవిత్రోత్సవాలలో భాగంగా అక్టోబర్ 22న ఉత్సవ ప్రారంభం స్నపన తిరు మంజనం (అభిషేకం) , ఉదయం సూర్యప్రభ వాహన సేవ , సాయంత్రం పెద్ద శేష వాహన సేవ ,23న వేద పారాయణం ఉదయం గజవాహన సేవ అంకురారోపణం , పవిత్రధివాసము , సాయంత్రం హనుమంత వాహన సేవ , 24న పవిత్ర ఆదివాస హోమం , వసంతోత్సవం ఉదయము కల్పవృక్ష వాహన సేవ , సాయంత్రం చంద్రప్రభ వాహన సేవ 25న సహస్ర తులసినామార్చన ఉదయం చిన్న శేష వాహన సేవ , సాయంత్రం సర్వ భూపాల వాహన సేవ , 26న అష్టోత్తర శతకల శాభిషేకం , మహా పూర్ణాహుతి , పవిత్ర అవరోహణం , ఉదయం మహా కుంభ ప్రోక్షణ ,పవిత్ర ప్రధానం , సాయంత్రం గోదోహణం , శరత్ పౌర్ణమి గరుడవాహన సేవలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఐదు రోజులపాటు జరిగే ఈ పవిత్రోత్సవాలలో భక్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య మంగళ దర్శనాన్ని చేసుకుని స్వామి వారి కృప కటాక్షాలను పొందగలరని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లను నిజమైన లబ్ధిదారులకు ఇవ్వాలి



పాలేరు, ప్రజాస్ఫూర్తి: తిరుమలాయపాలెం మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిజమైన నిరుపేద లబ్ధిదారులకు న్యాయం చేయాలని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో రేపు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు.బచ్చోడు గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో రాజకీయ పక్షపాతం లేకుండా నిజమైన అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నప్పటికీ, అర్హులైన వారికి న్యాయం జరగకపోవడం ఆందోళనకరమని అన్నారు.ప్రభుత్వం పేదలందరికీ న్యాయం చేస్తామని ప్రకటించినప్పుడు, ఆచరణలో కూడా అదే విధంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పార్టీలు, రాజకీయ అనుబంధాలు చూడకుండా గ్రామాల్లో పారదర్శకంగా సర్వే నిర్వహించి, నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనర్హులకు ఇళ్లు కేటాయించినట్లయితే వాటిపై విచారణ జరిపి, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరారు. నిరుపేదల ఇళ్ల సమస్యపై ప్రభుత్వం స్పందించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే వరకు అఖిలపక్షాల ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. అందువల్ల రేపు కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి ప్రజలు, పేదలు, ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో అంగిరేకుల నరసయ్య, గొర్రెపాటి రమేష్, తిమ్మిడి హనుమంతరావు, జక్కుల యాదగిరి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వార్డు నంబర్ గొర్రెపాటి రమణ, నందిపాటి వెంకన్న, ఎన్నబోయిన శ్రీనివాసరావు, అంగిరేకుల రమణ, గొర్రెపాటి లింగయ్య,రామచంద్ర,వెంకన్న,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ,ప్రజాస్ఫూర్తి : శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివ ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భం గా రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి లో నిర్వహించిన కార్యక్రమంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి అమ రవీరుల స్థూపానికి పుష్పాంజలి ఘటిం చి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రజల రక్షణ, శాం తిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలు అభినందనీయమని పే ర్కొన్నారు. మారుతున్న నేర ధోరణుల కు అనుగుణంగా ఆధునిక సాంకేతిక ప రిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగి స్తూ నేరాలను వేగంగా ఛేదిస్తున్న పోలీ సుల పనితీరును ప్రశంసించారు. ఈ కా ర్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య,సీఐలు వేణు, సత్యనారాయ ణ రెడ్డి, శ్రీనివాస్, దేవేందర్, భరత్ సు మన్, స్థానిక ఎస్ఐ మోదుగు భరత్ తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు.

మధురపురంలో అంబరాన్నంటిన అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

*** కన్నుల పండువగా అమ్మవారి ఊరేగింపు..**



ప్రజాస్ఫూర్తి ,షాద్ నగర్ : ఆధ్యాత్మిక శోభతో ఫరూక్ నగర్ మండలంలోని మధురపురం గ్రామం పులకించింది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గ్రామంలో భక్తిభావాన్ని వెల్లివిరియించాయి. అమ్మవారికి నిర్వహించిన విశేష పూజలు, భక్తిశ్రద్ధలతో సాగిన ఊరేగింపు, ఆటపాటలు, ఉత్సాహభరిత వాతావరణం గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి చీరల వేలంపాట లో భక్తులు పోటీపడారు. సుమారు రూ.10 లక్షల వరకు నిధులు సమకూరినట్లు నిర్వాహకులు తెలిపారు. గత ఏడాది ఉత్సవాల సందర్భంగా సమకూరిన విరాళాలను సద్వినియోగం చేస్తూ అమ్మవారికి శాశ్వత మండపం నిర్మాణాన్ని చేపట్టడం గ్రామంలో ఆధ్యాత్మిక అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ ఏడాది సమకూరిన నిధులతో వచ్చే ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు నవరాత్రి ఉత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు, పెద్దలు, మహిళలు, యువతీ యువకులు అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే ఉత్సవాలను ఇంతటి వైభవంగా నిర్వహించగలిగామని అన్నారు. భవిష్యత్తులోనూ గ్రామస్తులందరి సహకారంతో అమ్మవారి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి:బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ శాసన సభ్యులు కేపీ.వివేకానంద్ తన పుట్టిన రోజు సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని నగరంలోని వారి నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మైసయ్య అంతిమయాత్రలో వెల్లి విరిసిన మతసామరస్యం

*** కులమతాలకు అతీతంగా కన్నీటి వీడ్కోలు..**

*** పలు పార్టీల నాయకుల నివాళులు**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి : కులం వేరు.. మతం వేరు.. రాజకీయ సిద్ధాంతాలు వేరు.. కానీ మనసుల మధ్య ఉన్న అనుబంధం మాత్రం ఒక్కటే.. అని చాటిచెప్పారు..! కూసుమంచి మండల కేంద్రంలో మంగళవారం అకాల మరణం పొందిన కనకం మైసయ్య అంతిమయాత్ర బుధవారం మతసామరస్యానికి ప్రత్యేకగా నిలిచింది. ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన మైసయ్య మృతితో క్రైస్తవ కుటుంబంలో విషాదం నెలకొనగా, హిందూ, ముస్లిం సోదరులు ఆయనకు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు సైతం పార్టీలకు అతీతంగా తరలివచ్చి నివాళులర్పించారు. చిన్ననాటి స్నేహాలు, కష్టపడి బతికిన జీవితం, అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం.. ఇలా మైసయ్య జీవన ప్రయాణం కూసుమంచిలో మతసామరస్యానికి, మానవ సంబంధాలకు ఆలోచనగా నిలిచింది.

*** పేద కుటుంబంలో పుట్టి.. శ్రమనే నమ్ముకుని..**

కనకం మైసయ్య (54) సాధారణ కుటుంబంలో జన్మించి, జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ముందుకు సాగారు. కారు డ్రైవర్‌గా, ట్రాక్టర్ డ్రైవర్‌గా, కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగించారు. శ్రమను నమ్ముకుని బతికిన ఆయన కూసుమంచి మండల కేంద్రంలో అందరితో ఆత్మీయంగా మెలిగేవారు. స్థానికంగా పలువురితో సన్నిహిత సంబంధాలు కలిగి, అందరికీ తెలిసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. కష్టపడి పనిచేస్తూ జీవించిన ఆయన.. తన చుట్టూ ఉన్నవారితో ఏర్పరచుకున్న అనుబంధాలనే నిజమైన సంపదగా మిగిల్చుకున్నారు. మైసయ్య జీవితంలో చిన్ననాటి స్నేహాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఆయన క్లాస్‌మేట్లలో మాల సామాజిక వర్గానికి చెందిన అంతోటి వెంకన్న, ముస్లిం సామాజిక వర్గానికి చెందిన మహమ్మద్ సోయబ్ ఇంకా కట్ల నాగేశ్వరరావు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర బాధ్యులు ఈదయ్య తో ఉన్న అనుబంధం ఇందుకు నిదర్శనం. చిన్నతనంలో సోయబ్‌ను ఎత్తుకుని ముద్దాడినంత ఆత్మీయతతో మైసయ్య మెలిగేవారని గుర్తుచేసుకుంటున్నారు. బాల్యంలో మొదలైన ఈ స్నేహబంధం కులమతాల గోడలను ఎప్పుడో దాటిపోయింది. మైసయ్య అంతిమయాత్రలో సోయబ్‌తో పాటు పలువురు ముస్లిం సోదరులు పాల్గొనడం ఆ అనుబంధానికి ప్రతీకగా నిలిచింది.

*** పార్టీలకు అతీతంగా నివాళులు..**

కనకం మైసయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం తదితర పార్టీల నాయకులు నివాళులర్పించారు. తన చిన్నతనం నుండి కాంగ్రెస్ పార్టీ అభిమానిగా పెరిగిన మైసయ్య కాలక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకుడు పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డికి అభిమానిగా కూడా మారారు. నివాళులు అర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. హఫీజుద్దీన్, కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బజ్జూరివెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్‌రావు, గ్రామ సర్పంచ్ కొండ కృష్ణవేణి, మహిపాల్, బీజేపీ మండల నాయకుడు గుండా ఉపేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్న కుమార్ నలగాటి నాగయ్య మక్కపల్లి రామకృష్ణ దాసరి వెంకన్న సీపీఎం కార్మిక నాయకుడు చావ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

*** ఫోన్ ద్వారా పరామర్శించిన మాజీ మంత్రి..**

మైసయ్య మృతి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

*** మైసయ్య జీవితం.. సమాజానికి ఓ సందేశం..**

జీవితమంతా శ్రమిస్తూ, అందరితో ఆత్మీయంగా మెలుగుతూ సాగిన కనకం మైసయ్య ప్రయాణం ఒక విషయం గుర్తుచేస్తోంది. మనిషి గొప్పతనం ఆయన సంపాదించిన ఆస్తుల్లోనో, పొందిన హోదాల్లోనో ఉండదు.. ఆయన చుట్టూ ఉన్నవారి హృదయాల్లో సంపాదించుకున్న స్థానంలో ఉంటుంది. మైసయ్య అంతిమయాత్రలో కనిపించిన కులమతాలకు అతీతమైన ఆత్మీయత అందుకు నిదర్శనం.

ఘనంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ జన్మదిన వేడుకలు

*** ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుభాకాంక్షల జోరు..**

*** తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం రక్తదాన శిబిరం**

కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ జన్మదిన వేడుకలు బుధవారం పెట్ బషీరాబాద్ లోని క్యాంప్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ కి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా నాయకురాళ్ళు, అనుబంధ సంఘాల సభ్యులు పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

*** తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం రక్తదాన శిబిరం**


బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పుట్టినరోజును పురస్కరించుకొని పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో "తలసేమియా సికిల్ సెల్ సొసైటీ సౌజన్యంతో" సుభాష్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్, గుబ్బల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సుమారు 100 మంది రక్తదాతలను అభినందించి వారికి సర్టిఫికెట్లను అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ.... నా పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేసిన నిర్వాహకులకు, తలసేమియా సొసైటీ సభ్యులకు, రక్త దాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్త దానం చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రతీ ఒక్కరికీ పేరుపేరున నా కృతజ్ఞతలు. ఆరోగ్యకరమైన వ్యక్తి ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల వారి ఆరోగ్యం మరింత మెరుగవడమే కాకుండా ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని అందించినట్లు అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీ, డాక్టర్ శ్రీనివాస్ & బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

*** మొక్కలు నాటిన ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**

"బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని" గురువారంపేట్ బషీరాబాద్ లోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మొక్కలను నాటారు.


















Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.